# ఇట్లా జరిగిపోతే...

ఆరోజు పంతులు మాకయిదు లెక్కలిచ్చాడు. అయిదింటికీ అయిదు మార్కులూ తెచ్చుకున్నాను....మర్నాడు మళ్ళీ మామూలే.

ఆరోజు మాఅమ్మా నాన్నా పోట్లాడుకోలేదు. మాఅమ్మ చెప్పిందల్లా మానాన్న ఒప్పుకున్నాడు. అయన చెప్పిందల్లా ఆవిడ ఒప్పుకుంది. మాకొంపనెవరో మంత్రించినట్టయింది....తరవాత మళ్ళీ యథాప్రకారమే.

జీవితం ఈవిధంగా ఒక చిన్న వెలుగు వెలిగి వెంటనే ఎందుకు కొడారిపోతుందో తెలిసేదికాదు.

ఇదంతా దేవుడిచేసే పరీక్ష అనుకునేవాణ్ణి....

* * *

ప్రెస్సుకు కొత్తటయిపు తెప్పించాం. అచ్చగా దాంతోనే కొంత మేటరు కంపోజు చేయించాం. ప్రూఫులు చూస్తుంటే మా ప్రింటింగూ బాగున్నట్టే తోచింది. ఎప్పుడూ మా ప్రింటింగు అట్లాగే ఉండకూడదూ?....ఎప్పుడూ కొత్త టైపే వాడుతుంటే ఎందుకుండదూ? అయితే మరి, ఈ కొత్త టైపు పూర్తిగా అరిగితేగాని ఇందులోనుంచి మళ్ళీ కొత్త టైపుకు డబ్బురాదాయె!

విషమ సమస్యగా కనిపించింది....

* * *

వాళ్ళ అల్లుడు ఆరు నెల్లకోసారి పెళ్ళాన్ని అత్తవారింట దిగవిడిచి తనకు అయిదొందలిస్తేగాని మళ్ళీ తీసుకుపోడు. వాళ్ళిట్లాగే ఇస్తున్నారు....కాని ఎంత కాలమిస్తారు?

* * *

బాగా కలవాడు. అన్నదమ్ములులేరు. ఒకడే కొడుకు. ఒకటే కూతురు. హాయిగా కాలుమీద కాలేసుకుని కూర్చునే పరిస్థితి. మూడు తరాలు వెళ్ళిపోతై. నందోరాజా భవిష్యతి....ఆయన కొడుకు నాతోపాటు ఉద్యోగం చేస్తున్నాడు. ఈ ఉద్యోగం పోతే వీధిలో నిలబడవలసిందే!.... ఏమిటీ కర్మ?

* * *

"ఇటువంటి ఒడుదుడుకులు లేకుండా ఉండగలందులకే మన పూర్వీకులు వర్ణ వ్యవస్థ తెచ్చిపెట్టారు. అందరికీ పనులు చూపించారు. తురకలూ, పాశ్చాత్యులూ రావటంతో అంతా పాడయిపోయింది. వాళ్ళని బయటికి పంపించు. అంతా చక్కబడుతుంది" అన్నాడొక హిందూ మహాసభ మనిషి.

నమ్మకం చిక్కలేదు.

* * *

టైకాస్టింగు యంత్రంముందు నిలబడ్డాను. పూర్తిగా అరగంటసేపు ఏడిపించినమీదట యంత్రం సరిగా పని చెయ్యటం ప్రారంభించింది. అచ్చులు నున్నగా, నిగనిగలాడుతూ, పొట్టలూ, మట్టలూ లేకుండా రాసాగినై.

"ఆహా, ఈ విధంగా యంత్రం రోజల్లా పనిచెయ్యగూడదూ?" అన్నాడు పనిచేసే కుర్రాడు అచ్చుల్ని ప్రేమతో చూసుకుంటూ.

నాకా ప్రశ్నకు సమాధానం తెలిసింది!

"అసంభవం" అన్నాను.

"ఏం?" అన్నాడు.

"బాగా రాకుండా పోవటానికి కారణం ఇప్పుడు మంచి అచ్చులు రావటంలోనే ఉంది." అన్నాను.

వాడు నామాట నమ్మలేకపోయినాడు.

"చూడు. బాగా వస్తున్నంత సేపూ అచ్చులు గబగబా లాగేస్తావు. లాగిన కొద్దీ నీ తొట్టిలో ఉన్న లోహం తగ్గిపోతుంది. అందుకని కొత్త లోహపు దిమ్మలు వేస్తావు. తొట్టి చల్లబడుతుంది. నీ అచ్చులు సరిగారావు. అదీగాక, నీరై క్రమంగా వేడెక్కుతుంది. దాన్ని తగినంత చల్లబడేస్తేగాని అచ్చులు సరిగా రావు."

"తొట్టి ఎంత వేడిగా ఉండాలో, డై ఎంత చల్లగా ఉండాలో తెలిస్తే అచ్చులు బాగా వస్తాయేమో?" అన్నాడు మావాడు.

"అంతేకాదు. తొట్టి ఏ వేగాన ఖాళీ అవుతుందో, డై ఏవేగాన వేడెక్కుతుందో తెలిసి, దానికి ఎప్పటికప్పుడు అవసరమైన చికిత్స చెయ్యగలిగితే తియ్యకుండా మంచి అచ్చులు వస్తా"యని చెప్పాను.

సంఘంలోమటుకు ఇంతేకాదా? ఒక వ్యక్తిగాని, వ్యక్తుల సముదాయం గాని శాశ్వతంగా సుఖంగా ఉండటానికి సులువు పద్ధతు లెక్కడున్నై?

ధనికుల సంతతి ధనికులుగానే ఉండగలందులకు వారసత్వం పెట్టారు. ఏమవుతున్నది? లక్షాధికారికి కాలక్రమాన లక్షమంది వారసులవుతున్నారు. దీన్ని కూడా తప్పించుకుందామని రాజరికాలకి ఒకడే వారసుణ్ణి పెట్టారు. ఈ సులువు మార్గం పనిచేసి తీరాలి! పనిచేసిందా? ఆ సులువు మార్గ మూలంగానే రాజరికం సంఘానికి అనర్థంగా తయారయింది–వాళ్ళ అల్లుడు వాళ్ళమ్మాయికి ఆనందం ఇవ్వటానికి అనర్హుడయినట్టుగానే.

మార్పుయొక్క తత్వాన్ని అర్థం చేసుకోకుండా, దానికి అనుగుణమైన మనుష్య ప్రయత్నం చెయ్యకుండా, ఏదో ఓ మంచి జాగా చూసుకుని "అమ్మయ్య!" అని చతికిలబడి ఆమీదట శాశ్వతమైన ఆనందం పొందుదామని మానవుడు చేసే ప్రయత్నాలు ఫలించటానికి వీల్లేదు. పరిణామస్వరూపుడైన భగవంతు డామోదించడు. అటువంటి ప్రయత్నాలు చేసే వాళ్ళమీదికి సంఘాన్ని లేవదీస్తాడు.

[ప్రథమ ముద్రణ : ఆగష్టు 1945, ఆంధ్రజ్యోతి మాసపత్రిక]